ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | జూన్ 12, 2026 | సంపుటి : 7 | సంచిక : 13 | పేజీలు : 2


## ప్రధాని మోదీతో సీఎం రేవంత్ భేటీ



**ఢిల్లీ, ఆయుధం:** ప్రధాని నరేంద్రమోదీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. నీతి ఆయోగ్ సమావేశం తర్వాత ఇరువురు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు అంశాలపై ప్రధానితో సీఎం చర్చించారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, మూసీ ప్రక్షాళన, పట్టణ అభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు.



## మధ్యవర్తిత్వం నాకు చాలా ఇష్టం

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

2 లో




## అభివృద్ధి పథంలో.. భారత్: మోదీ

- ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం
- పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరు

**ఢిల్లీ, ఆయుధం:** ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, అస్థిరత ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి పథంలో బలంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు యువత, మహిళల సాధికారత ఎంతో కీలకమన్న మోదీ, దేశ ప్రగతి ప్రస్థానంలో వారి భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం దిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్రమంత్రులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్, ఇతర సభ్యులు కూడా పాల్గొన్నారు. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రతి పౌరుడికి ప్రయోజనం చేకూరేలా సమగ్ర మానవాభివృద్ధిని సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశలో కేంద్ర, రాష్ట్రాల సమష్టి బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు వీలుగా భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ప్రధాని గుర్తుచేశారు. ఈ ఒప్పందాలు దేశంలోని MSMEలకు మంచి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకుంటూ గ్లోబల్ మార్కెట్లకు సిద్ధం కావడానికి తోడ్పడతాయని వివరించారు. మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసి, భారత దేశ అభివృద్ధి ప్రయాణాన్ని ముందుకు నడిపించేలా రాష్ట్రాలు వారి విద్య, నైపుణ్యాభివృద్ధి, భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీ కోరారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనమంతా కలిసి పని చేస్తున్నామని, వికసిత్ భారత్ అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేయడంలో కేంద్రం, రాష్ట్రాల సమష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కలిసి పనిచేయడానికి నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రధాని ప్రసంగానికి సంబంధించిన వివరాలను నీతి ఆయోగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దేశంలో యువత ఒక చారిత్రక అవకాశం అన్న మోదీ, వారిని ఎంతమాత్రం కోల్పోకూడదని అన్నారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల ద్వారా భారతీయ యువతకు సరైన వాతావరణాన్ని సృష్టించడం మన ప్రాధాన్యంగా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు.




## టీఆర్ఎస్ పేరుపై బీఆర్ఎస్ అభ్యంతరం

కవిత రాజకీయ పార్టీ తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్)పై బీఆర్ఎస్ అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. టీఆర్ఎస్ పేరు తెలంగాణ సెంటిమెంట్ తో ముడిపడి ఉందని, అందువల్ల ఆ పేరు కేటాయించవద్దని ఈసీఐని కోరింది. ఇప్పటికీ ప్రజలు బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తారని పేర్కొంది. ఆ పేరును ఎవరికీ కేటాయించవద్దని విజ్ఞప్తి చేసింది. టీఆర్ఎస్ పేరుపై ఈసీఐకి దాదాపు 700 అభ్యంతరాలు అందాయి. కవిత పార్టీపై అభ్యంతరాలు చెప్పుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం గతంలో సూచించిన సంగతి తెలిసిందే.

– హైదరాబాద్, ఆయుధం



## ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు

- పంటల మార్పిడి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క
- గోవిందరావుపేటలో జిల్లా స్థాయి మెగా రైతు మేళా
- హాజరైన ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆయుధం:** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు సాధించాలని, పంటల మార్పిడి సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం గోవిందరావుపేట మండలం సోమలగడ్డ క్రాస్ వద్ద పీఎస్ఆర్ గార్డెన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు అవగాహన సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పంటల మార్పిడి విధానం, నూతన వంగడాల వినియోగం, ఎరువుల వినియోగాన్ని తగ్గించే పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే శాస్త్రీయ సాగు విధానాలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రైతుల సంక్షే మే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు.

మిగతా 2లో






## నేతన్నల భిక్షాటన

- ఆరో రోజుకు చేరిన నేత కార్మికుల నిరసన
- పలువురు నేతల సంఘీభావం
- మంత్రి, మాజీ మేయర్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ధ్వజం

**వరంగల్, ఆయుధం:** టెండర్లు రద్దు చేసి టెస్కో ద్వారానే కొనుగోళ్లు చేపట్టాలని నేత కార్మికులు చేపట్టిన నిరసన ఉధృతమవుతోంది. ఆరోరోజు నిరసనలో భాగంగా గురువారం బిక్షాటన చేశ్శారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన మహాసభ లో పలువురు వక్తలు హాజరై తమ సంఘీభావాన్ని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ఇంటలెక్షన్ ఫోరం అధ్యక్షులు చిరంజీవులు రిటైర్డ్ ఐఏఎస్ మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు రాజకీయ నాయకులు చేనేత వర్గాలకు పెద్ద పీట వేస్తామని అన్ని విధాల ఆదుకుంటామని హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత వారిని మోసం చేయుట మంచిది కాదన్నారు. వరంగల్ తూర్పు నుంచి గెలిచిన మంత్రి, వరంగల్ నగర మాజీ మేయర్ పదవులు పద్మశాలీల ను గెలిపించి పెద్దపీట వేశారని.. పద్మశాలీల అభ్యున్నతికి వారు పాటుపడకపోవడం చాలా విచారించదగ్గ విషయం అన్నారు. గత పది రోజులుగా పద్మశాలి సమాజంలోని ప్రజలు పనులు లేక రోడ్డుపైన దీక్షా పోరాటం చేస్తుంటే వారు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి పద్మశాలి సమాజ బిడ్డలకు ఆసరాగా ఉండి వారి అభివృద్ధికి పాటుపడాలని లేనిపక్షంలో ఈ ప్రభుత్వం వారి ఆగ్రహానికి పతనం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.



## ఫార్మాసిటీకి 17 ఎకరాలు ఇచ్చా..

- రియల్ ఎస్టేట్‌కి వాడితే ఊరుకుంటామా?: హరీశ్‌రావు

ఫ్యూచర్ సిటీని వందకు వంద శాతం బీఆర్ఎస్ రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాకం వల్ల రూ.70వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు పోయాయన్నారు. "ఫార్మా సిటీ రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భూములు ఫార్మాకు కాకుండా మార్పులు చేస్తే చట్టం అంగీకరించదు. ఫార్మాసిటీ కోసం నేను కూడా 17 ఎకరాల భూమి ఇచ్చాను. ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే ఊరుకుంటామా? ఇప్పటికే పలువురు రైతులు ఈ భూములపై కేసులు వేశారు. జర్నలిస్టులపై ప్రేమ ఉంటే వివాదాలు లేని భూములు ఇవ్వొచ్చు కదా. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా మేం వ్యతిరేకించం. పాత భూములనే వారికి ఎందుకు ఇవ్వరు?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

– హైదరాబాద్, ఆయుధం

## ఏఎస్సైకి సైబర్ మోసం

- డబ్బు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ నగరంలోని పంజాగుట్ట పీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న నరసయ్య సైబర్ మోసానికి గురయ్యారు. ఆర్టీఏ చలాన్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఆయనకు ఏపీకే ఫైల్ పంపించారు. తద్వారా నరసయ్య బ్యాంకు ఖాతా నుంచి రూ.49,139 దోచుకున్నారు. ఈనెల 8న తన మొబైల్ ఫోన్‌కు పలుమార్లు మెసేజ్‌లు వస్తుండటంతో ఏఎస్సై పరిశీలించారు. తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కట్ అవుతున్నట్లు గుర్తించారు. తన ప్రమేయం లేకుండా నగదు పోతుండటంతో ఆందోళనకు గురై సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు.

– హైదరాబాద్, ఆయుధం



## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- పరకాలలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ క్షేత్రస్థాయి పరిశీలన
- మున్సిపల్ కార్యాలయం, దామెర చెరువు అభివృద్ధి పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం సందర్శన

**పరకాల, ఆయుధం:** హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరకాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఇతర అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సేవల నిర్వహణను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని పరిశీలించి పచ్చదనం పెంపొందించే చర్యలను పరిశీలించారు. అదే విధంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దామెర చెరువు కట్ట బండ్, నాలా, కాలువ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. తదుపరి అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, నిర్మాణ పనుల స్థితిగతులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రధాన లక్ష్యం

2 లో





## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

2 లో

## చురుగ్గా 'నైరుతి'..

ఏపీలో పలు జిల్లాలకు వర్షసూచన



2 లో

# మధ్యవర్తిత్వం నాకు ఇష్టమైన విషయం

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వం గురించి కీలక వ్యాఖ్యలు
- మధ్యవర్తిత్వం తనకు చాలా ఇష్టమైన విషయమని వెల్లడి
- దేశంలోని ప్రతి పట్టణం, వీధిలో ప్రజలకు మధ్యవర్తిత్వం అంటే ఏమిటో తెలుసన్న సీజేఐ



**జాతీయం, ఆయుధం:** భారత న్యాయవ్యవస్థ మధ్యవర్తిత్వాన్ని కేవలం ఒక ప్రత్యామ్నాయంగానే కాకుండా, ఒక పటిష్టమైన వివాద పరిష్కార యంత్రాంగంగా ప్రోత్సహిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం తనకు చాలా ఇష్టమైన విషయమని పేర్కొన్నారు. అందుకే సుప్రీంకోర్టు లీగల్ సర్వీస్ కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) శిక్షణ పొందిన మధ్యవర్తులతో ఒక పెద్ద బృందాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. లండన్‌లోని భారత హైకమిషన్ నిర్వహించిన ఒక ప్యానెల్ చర్చ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. భారతదేశంలోని ప్రతి పట్టణంలో, ప్రతి వీధిలోని ప్రజలకు మధ్యవర్తిత్వం అంటే ఏమిటో తెలుసని తాను గర్వంగా చెప్పగలనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అలాగే భారత్‌లో మధ్యవర్తిత్వం పరిణామ క్రమాన్ని, దాన్ని ప్రోత్సహించడంలో న్యాయవ్యవస్థ పాత్రను వివరించారు. మధ్యవర్తిత్వ చట్టం 2023 అమల్లోకి రాకముందు న్యాయస్థానాలు మధ్యవర్తిత్వాన్ని ఒక పటిష్టమైన వివాద పరిష్కార యంత్రాంగంగా చురుకుగా ప్రోత్సహించాయని చెప్పారు. 2004లో హైకోర్టు న్యాయమూర్తిగా తన తొలి అనుభవాలను పంచుకున్నారు. ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీం కోర్టు స్థాయిలలో మధ్యవర్తిత్వ కేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని ఆయన ప్రముఖంగా గుర్తు చేశారు.

మధ్యవర్తిత్వ చట్టం 2023 అనేది దశాబ్దాలుగా పరిణామం చెందిన చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సృష్టించిన ఒక వ్యవస్థకు పరాకాష్టగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. ఈ క్రమంలో మధ్యవర్తిత్వ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన న్యాయపరమైన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్ర న్యాయ అకాడమీల ద్వారా మధ్యవర్తులకు తప్పనిసరి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం, అలాగే పరస్పర అంగీకారంతో కూడిన వివాద పరిష్కార యంత్రాంగాలపై పౌరులకు అవగాహన కల్పించడంలో జాతీయ న్యాయ సేవల అథారిటీ, లోక్ అదాలత్‌ల పాత్రను ఆయన నొక్కి చెప్పారు. ఆర్బిట్రేషన్ కంటే మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలా అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ రెండు యంత్రాంగాలకు న్యాయవ్యవస్థలో ముఖ్యమైన పాత్ర ఉందన్నారు.

**'మధ్యవర్తిత్వం మంచిది, వేగవంతమైనది'**

"నేను ఆర్బిట్రేషన్‌ను నిరుత్సాహపరచను. దేశాల మధ్య పెరుగుతున్న వాణిజ్య సంబంధాలు అనివార్యంగా వివాదాలను సృష్టిస్తాయి. అయితే మధ్యవర్తిత్వం మంచిది, వేగవంతమైనది. వాణిజ్య సంబంధాలను కాపాడగల సామర్థ్యం ఉన్నందున అన్ని పక్షాలు మొదట మధ్యవర్తిత్వం ద్వారానే విభేదాలను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. ఆర్బిట్రేషన్‌లో ఒక తీర్పు వెలువడిన వెంటనే తరచుగా తదుపరి వ్యాజ్యానికి నాంది పలుకుతుంది. మధ్యవర్తిత్వంలో ఒకసారి ప్రక్రియ విజయవంతంగా ముగిసిన తర్వాత అది వివాదానికి ముగింపు పలుకుతుంది. మధ్యవర్తిత్వానికి, ఆర్బిట్రేషన్‌కు మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.





# ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు

(మొదటి పేజీ తరువాయి..)

రైతులు సంప్రదాయ సాగుతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, పంటల మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సాగులో అధిక రసాయనాలు ఉపయోగిస్తే అనేక అనర్థాలకు దారి తీస్తుంది సేంద్రియ వ్యవసాయాలతో ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతు రుణమాఫీ ద్వారా రూ.21 వేల కోట్లను విడుదల చేసి దేశంలోనే అతి పెద్ద రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు.రైతు భరోసాతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, రైతుల పంటను కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరిస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు. జిల్లాలో తొలి దశలో ప్రారంభమైన ఆయిల్ పామ్ సాగు ప్రస్తుతం వేలాది ఎకరాలకు విస్తరించిందని, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే పంటగా రైతులు దీనిని స్వీకరించాలని సూచించారు. పోడు, బీడు భూముల్లో కూడా ఆయిల్ పామ్‌తో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని కోరారు.

వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ పట్టాలు లేని రైతులకు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు వంటి అంశాల్లో ఎలాంటి వివక్ష లేకుండా రైతులకు సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం ద్వారా ఖర్చులు తగ్గించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను సాగు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో మెగా రైతు మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, నూతన సాగు పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

వ్యవసాయ ఉత్తమ రైతులను రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క,ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సన్మానించి అభినందించారు. రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

అనంతరం వివిధ స్టాల్స్‌ను మంత్రి సీతక్క, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి సందర్శించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన వరి నాటు యంత్రాన్ని మంత్రి సీతక్క స్వయంగా నడిపి దాని పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, జిల్లా అధికారులు, ములుగు, ఏటూరు నాగారం ఆత్మ కమిటీ చైమెన్లు రవీందర్ రెడ్డి, కర్ల అరుణ, చల్వాయి, గోవిందరావు పేట గ్రామాల సర్పంచ్ లు, సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రధాన లక్ష్యం



**పరకాల, ఆయుధం:** పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు.

ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య, ప్రతిరోజూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు, నెలవారీ ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య, మందుల నిల్వలు, నూతన ఆసుపత్రికి అవసరమైన అదనపు పరికరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలు, ఆసుపత్రి పరిధిలోని మండలాల వివరాలను ఎమ్మెల్యే సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... పరకాల ఏరియా ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని మందులు ఆసుపత్రిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. గత నెలలో నూతన ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ప్రతి రశీదు, బిల్లు, రికార్డును పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులను సంబంధిత ఏజెన్సీలు వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల సంఖ్య, శస్త్రచికిత్సలు, ప్రసవాల గణాంకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, నాగరాణి, రాఘవరెడ్డి, పుష్పలత, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రఘునాథపల్లి, ఆయుధం;** 132 కేవీ రఘునాథపల్లి సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రఘునాథపల్లి మండలంలోని రఘునాథపల్లి, కాంచనపల్లి, గబ్బెట, నిడిగొండ, కోమల్ల, ఖిలా షాపూర్, అశ్వరావు పల్లి సబ్ స్టేషన్లకు, అలాగే లింగాల గణపురం మండలంలోని కుందారం, వడిచర్ల, వనపర్తి సబ్ స్టేషన్ లకు 12న శుక్రవారం ఉదయం 7 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జనగామ డివిజనల్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించగలరని ఆయన కోరారు.

# రేపు ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగ మేళా

**హనుమకొండ, ఆయుధం:** హన్మకొండ జిల్లా డీఐఈవో అనుమతితో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాంలో భాగంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈనెల 13న ఉదయం 11 గంటలకు ICSS Computer education center హన్మకొండలో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా డీఐఈవో గోపాల్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలలలో 2025, 2026 సీసీఈ, బైపిసి, ఒకేషనల్ గ్రూప్స్ లో 75% తో అర్హులైన అభ్యర్థులు తమ పదో తరగతి పాస్ సర్టిఫికెట్ నకలు, ఇంటర్మీడియట్ పాసు సర్టిఫికెట్ నకలు, ఆధార్ కార్డు నకలు, ఒక ఫోటో & ఆండ్రాయిడ్ మొబైల్ తో డ్రైవ్ స్థలానికి హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు హెచ్.సి.ఎల్. ప్రతినిధి 7569177071 లో సంప్రదించాలని పేర్కొన్నారు.



# విధి నిర్వహణలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**హనుమకొండ, ఆయుధం:** విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులకు తెలియజేశారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కిట్స్ కళాశాల సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తొలి సారిగా గతంలో ఎన్నడు లేని విధంగా సిసిటిఎనఎస్ అప్లికేషన్ 2.0 ద్వారా పోలీస్ కమిషనర్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ అనలైన్ పద్దతిలో సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుకోవడంతో పాటు, పెండింగ్ కేసుల, కేసుల పురోగతికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులు సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి తనిఖీ చేయాలని సూచించారు. విద్యా సంస్థల 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకోని విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను పాఠశాలలకు తరలించే స్కూల్ బస్‌ల స్థితిగతులపై స్థానిక పోలీస్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి బస్సులను తనిఖీ చేయాలన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వరుస సంఘటనలను దృష్టిలో వుంచుకోని నగరంలో నేపాల్ దేశానికి చెందిన పౌరులు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎక్కడ నివసిస్తున్నారు, ఇండ్లల్లో పనిచేసే వారి వివరాలను సేకరించాలని సూచించారు. రాబోవు లోక్ ఆదాలత్ ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలనిన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించడంతో పాటు, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, అదనపు డిసిపిలు రవి, బాలస్వామి, ప్రభాకర్ రావు, సురేష్‌కుమార్, ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం




**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వ శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అలాగే ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ వై.వి.గణేష్, ఐఏఎస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ, ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు నిరుద్యోగ యువత వయోపరిమితి దాటిపోతూ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఖాళీలపై పూర్తి వివరాలు వెల్లడించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుదీర్, నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల భిక్షాటన

(మొదటి పేజీ తరువాయి..)



బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాల వల్ల తెలంగాణలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన చేనేత రంగం కుప్పకూలిపోయిందని, వేలాది నేతన్నల కుటుంబాలు వీధిన పడ్డాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వరంగల్ కొత్తవాడలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఐదు రోజులుగా మగ్గాలు బంద్ చేసి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న చేనేత సహకార సంఘాల కార్మికులకు గురువారం బీజేపీ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది.

ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు పెద్దపీట వేస్తామని, అన్ని విధాలా ఆదుకుంటామని హామీలు ఇచ్చి మంత్రి కొండా సురేఖ ఓట్లు దండుకున్నారని మండిపడ్డారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేనేత రంగాన్ని, ఆ రంగంపై ఆధారపడి బతుకుతున్న వేలాది కుటుంబాలను కొండా సురేఖ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. చేనేత కార్మికుల జీవితాలతో ఆడుకుంటూ, చేనేత, పద్మశాలి ఓట్లతో గెలిచి వారిని తీవ్రంగా మోసం చేసిన రాష్ట్ర మంత్రి కొండ సురేఖ, వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులను తక్షణమే కుల బహిష్కరణ చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు.



**చేనేత కార్మికులపై కక్ష కట్టిన సీఎం**

**– ఈగ మల్లేశం**

రాష్ట్రంలో చేనేత కార్మికులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష కట్టారని కేంద్ర ఖాది, చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్, అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గురువారం వరంగల్ నగరంలోని కొత్తవాడలో చేనేత కార్మికులు చేస్తున్న దీక్షలను ఈగ మల్లేశం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గాని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం గాని పాలకులు కులవృత్తులను దెబ్బకొట్టిన దాకాలు లేవన్నారు. కులవృత్తులనేవి జీవన ఉపాధికి సంబంధించిన అంశమని, కులవృత్తిదారులు ఏ రోజుకారోజు కష్టపడుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏకులాన్ని టార్గెట్ చేయకుండా కేవలం పద్మశాలిని మాత్రమే టార్గెట్ చేయడం సరికాదన్నరు. పద్మశాలి కులస్తులను రోడ్డుపాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా టెండర్ విధానాన్ని రద్దుచేసి పద్మశాలీలను ఆదుకోవాలని అన్నారు. చేనేత రంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరైన అవగాహన లేకపోవడం వల్ల ఆయనను నాయకులు, అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. గతంలో ఉన్న విధంగా టెస్కో ద్వారా ప్రపంచంలోనే పేరుగాంచిన కొత్తవాడ చేనేత కార్మికులు తయారుచేసిన నూలు వస్త్రాలు, కార్పెట్స్, చాట్రాంజలి, బెడ్ షీట్స్ విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో టిపిసిసి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, సిహెచ్. ప్రకాష్, కొంగ వీరస్వామి, ఎర్రమడ వెంకన్న, ఎం. వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, ఎం.ఉషారాణి, సత్యనారాయణమూర్తి, పంతగాని శ్రీనివాస్, సంపత్, వెంకటమల్లు, సాంబయ్య, ఓం ప్రకాష్, కిరణ్, కుమారస్వామి, జయరాం, కమలాకర్, చిన్న భద్రయ్య, శ్రీకాంత్, సంపత్, చిన్న వీరస్వామి, పాల్గొన్నారు.

# చురుగ్గా 'నైరుతి'..

**ఏపీలో పలు జిల్లాలకు వర్షసూచన**

**విశాఖపట్నం, ఆయుధం:** నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల్లో మిగిలిన ప్రాంతాల విస్తరణకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. తెలంగాణ మీదుగా దక్షిణకోస్తాపై మరో ఉపరితల ఆవర్తనం, ద్రోణి ఏర్పడింది. వీటి ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

'అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశముంది. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, నంద్యాల, కడప, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే వీలుంది.'' అని వాతావరణ కేంద్రం తెలిపింది.

**తెలంగాణలోనూ..**

తెలంగాణలోనూ పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే వీలుందని వెల్లడించింది. రేపు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని పేర్కొంది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695